సాక్షి
విశాఖపట్నం

శనివారం । 18 । నవంబర్ । 2023



నమో నాగేంద్రాయ..
ఓం నమో నాగేంద్రాయ నమః అంటూ భక్తులు శుక్రవారం నాగుల చవితి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 8లో



ఆస్పత్రుల్లో సమూల మార్పులు
నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. 8లో



పంచగ్రామాలకు మేలు 8లో
పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు అవకాశం కల్పిస్తూ సీఎం తీసుకున్న నిర్ణయం ఆనందాన్ని నింపిందని ముత్తంశెట్టి అన్నారు.

న్యూస్‌రీల్

యువతకు సంగీతం కోర్సుల్లో అత్యుత్తమ శిక్షణ



కేక్ కట్‌చేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: మానసిక ప్రశాంతతకు సంగీతం దోహదపడుతుందని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ–సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్–మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగంలో శుక్రవారం నాక్ విజయోత్సవం, సెయింట్ లూక్స్ స్టూడియో ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కేక్ కట్‌చేసి, నూతనంగా అభివృద్ధి చేసిన కంప్యూటర్, ఆడియో, వీడియో ఎడిటింగ్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఏయూ నాక్ ఏ ప్లస్ ప్లస్, 3.74 సీజీపీఏ సాధించడంపై సెయింట్ లూక్స్ సంస్థల నిర్వాహకులు ఆశీర్వాద్ లూక్, ప్రీతం లూక్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్‌పై ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ తరువాత ఎలాంటి చదువుల వైపు వెళ్లాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కాలేజీల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు ఆర్ఐఓ రాయల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో సదస్సులు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ బృందాలు ఆయా కాలేజీలను సందర్శిస్తాయన్నారు. ఇంటర్మీడియెట్ తరువాత డిగ్రీతో పాటు ఉద్యోగావకాశాల కోసం ఎలా ముందుకెళ్లాలనే దానిపై విద్యార్థులకు వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుందని సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి గౌరవ సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

1 నుంచి 7 వరకు స్థాయీ సంఘ సమావేశాలు

శనివారం ఉదయం 9 గంటలకు స్థాయీ సంఘ సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 9 గంటలకు 2, 5వ స్థాయి, 9.30 గంటలకు 3, 4వ స్థాయి, ఉదయం 10 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో ఆ ప్రకటనలో తెలిపారు.

121 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలోని 8 అనుబంధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 121 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పోస్టులు భర్తీ చేయనున్నట్టు ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఈ పోస్టుల వివరాలు,ఇతర సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. www.amc.edu.in, www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచినట్టు వివరించారు.

పుట్టిన రోజునాడే విషాదం



మనోహర్, అభిషేక్ (ఫైల్)

బీచ్‌లో పుట్టిన రోజు వేడుకలు చేసుకున్న మనోహర్.. అతని స్నేహితుడు అభిషేక్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఏయూ అవుట్ గేట్ వద్ద శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 8లో

సామాజిక న్యాయంలో సరికొత్త ముద్ర

- 'విశాఖ తూర్పు'లో అత్యధికంగా బీసీలకు పదవులు
- 62 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశం
- పదవులు పొందిన వారిలో 32 మంది మహిళలే
- నేటి బస్సు యాత్రకు హాజరుకానున్న మంత్రులు సీదిరి, మేరుగు, రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ ఎంవీవీ

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి సరికొత్త నిర్వచనమిచ్చారు. గత ప్రభుత్వాల వలే కాకుండా చేతల్లో చూపించి ఔరా అనిపించారు. ఇందుకు విశాఖ తూర్పు నియోజకవర్గంలో రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో 62 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశమిచ్చి సమన్యాయం చేయడమే నిదర్శనం. తూర్పు నియోజకవర్గంలో మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ పదవులను బీసీ యాదవ మహిళలకు, రెండు ఎమ్మెల్సీ పదవులను బీసీలకు కేటాయించి సామాజిక న్యాయానికి, మహిళా సాధికారతకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసి సరికొత్త చరిత్రను లిఖించింది. అలాగే రెండు కార్పొరేషన్ చైర్మన్లు, 20 కార్పొరేషన్ డైరెక్టర్లు, ఒక ఎయిర్‌పోర్టు డైరెక్టర్, ముగ్గురు మార్కెట్ కమిటీ మెంబర్‌లు, ప్రధాన దేవస్థానాల పాలక మండలి చైర్మన్‌లుగా, సభ్యులుగా, డైరెక్టర్లుగా, 8 మందికి బీసీ కార్పొరేటర్లుగా అవకాశం కల్పించారు. ఇలా రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పదవులు దక్కాయి.

పదవులు పొందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు

- మేయర్‌గా గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలుగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్‌గా అక్కరమాని విజయనిర్మల, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా పేర్ల విజయచందర్, నాగవంశం కార్పొరేషన్ చైర్మన్‌గా బొడ్డు అప్పలకొండకు అవకాశం ఇచ్చారు.
- ఏపీఐఐసీ డైరెక్టర్‌గా మొల్లి అప్పారావు, ఏపీ కల్చరల్ డైరెక్టర్‌గా దూశి రఘు, ఏపీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గుంటబోయిన లక్ష్మి, ఏపీ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మద్దుల చాయదేవ్, ఏపీ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బలగాని భారత లక్ష్మి, ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పీలా జోషీలా, ఏపీ నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లుగా బయాన మీనాక్షి, వంద్రాసి శ్యామల, ఏపీ రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా బోరా సుభాషిణి, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్‌గా కె.రామన్నపాత్రుడు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా బుగత లిఖిత, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వి.వరలక్ష్మి, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పతివాడ వెంకట లక్ష్మి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కారి శ్రీలక్ష్మి, ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బలిదే పద్మావతి, ఏపీ కల్చరల్ డైరెక్టర్‌గా సూరాడ వెంకట లక్ష్మి, ఏపీ ఎయిర్‌పోర్టు కమిటీ డైరెక్టర్‌గా పల్లా దుర్గ, మార్కెట్ కమిటీ మెంబర్లుగా ప్రియాంక యావత రెడ్డి, కొచ్చి సుమిత, కనక మహాలక్ష్మి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా సత్యవరపు సతీష్, సువ్వాడ శ్రీదేవి–సింహాచలం ట్రస్టీ, ఏపీ పోలీస్ హౌసింగ్ డైరెక్టర్‌గా పీతల గోవింద్‌ను నియమించి బీసీలకు పెద్దపీట వేశారు.
- అదేవిధంగా ఎస్సీలకు సంబంధించి ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్‌గా ఖాదర్ సకీనా బేగం, ఏపీ ఫోక్ అండ్ క్రియేటివిటీ అకాడమీ బోని శివరామకృష్ణ, ఏపీ ఎల్‌ఐడీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎజ్జెల రాజకుమారి, ఓసీకి చెందిన ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం–కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టీగా నామినేటెడ్ పదవులు కేటాయించారు.
- జీవీఎంసీ కార్పొరేటర్లుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అక్కరమాని రోహిణి(12వ వార్డు), స్వాతి దాస్(9వ వార్డు), కెల్ల సునీత(13వ వార్డు), అప్పారి శ్రీవిద్య(15వ వార్డు), మొల్లి లక్ష్మి (16వ వార్డు), గుడ్ల సత్యారెడ్డి(23వ వార్డు), పల్లా అప్పలకొండ(28వ వార్డు)కు అవకాశం ఇచ్చారు.
- చినవాల్తేరు ఆలయ దేవస్థానం చైర్మన్‌గా కొయ్య గంగాదేవి కాశీ విశ్వేశ్వరరావు, సభ్యులుగా గుర్రాల రాజు, వారధి విజయ్, కుప్పిలి చంద్రకళ, కొయ్య ధనలక్ష్మి, దత్తాత్రేయ ప్రభు సాయి(ఓసీ బ్రాహ్మణ)కు పదవులు ఇచ్చారు.
- చినవాల్తేరు జగన్నాథస్వామి ఆలయ చైర్మన్‌గా వారది రాజేష్, సభ్యులుగా గుంటబోయిన హరిప్రసాద్, కొయ్య సంపత్, కోరాడ, గాయత్రి, చెన్నా వరలక్ష్మి(ఎస్సీ)కి అవకాశమిచ్చారు.
- పాండురంగ స్వామి ఆలయ చైర్మన్‌గా మట్టుపల్లి హనుమంతురావు, సభ్యులుగా కె.నరసింహమూర్తి(ఓసీ), రావులపాలెం రాజ్యలక్ష్మి(ఎస్సీ), యర్రా సన్యాసినాయుడు, దారపు విజయలక్ష్మికి పదవులు కేటాయించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, మైనార్టీలకు సమ ప్రాధాన్యం కల్పించారు.
- వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులుగా ఎం.పద్మజ(బీసీ), బర్ల మంగరాజు(బీసీ), డి.వెంకటలక్ష్మి(ఎస్సీ)కి అవకాశమిచ్చారు.



ఏఎస్ రాజా గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లు

నేడు 'విశాఖ తూర్పు'లో సామాజిక సాధికార బస్సు యాత్ర

వైఎస్సార్‌సీపీ చేపట్టిన రెండో విడత సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం విశాఖ తూర్పు నియోజకవర్గంలో జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మొదటి విడత బస్సు యాత్ర విజయవంతం కావడంతో రెంటించిన ఉత్సాహంతో రెండో విడత యాత్రకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సన్నద్ధమయ్యారు. ఈ యాత్రలో సీఎం వైఎస్ జగన్ బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించనున్నారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వం పేదలకు చేసిన మోసాన్ని ఎండగట్టనున్నారు.

బస్సు యాత్ర సాగుతుందిలా..

విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సు యాత్రకు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, సోషల్ వెల్ఫేర్ మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు హాజరుకానున్నారు.

- ఉదయం 12.30 గంటలకు ఆరిలోవ కాలనీ బస్ స్టాప్ వద్ద ప్రెస్‌మీట్
- మధ్యాహ్నం ఒంటి గంటకు క్రిస్టియన్ మైనారిటీ ఫంక్షన్ హాల్ వద్ద విందు
- 2 గంటలకు ఆరిలోవ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి మంత్రులు నివాళులర్పించిన అనంతరం బస్సుయాత్ర ప్రారంభం
- 2.30 గంటలకు తోట గరువులోని జెడ్పీహెచ్ స్కూల్‌ను సందర్శించనున్న మంత్రులు
- 2.45 గంటలకు పెదగదిలి జంక్షన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి ర్యాలీగా బహిరంగ సభ స్థలికి సాగనున్న బస్సుయాత్ర
- 3.15 గంటలకు ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా గ్రౌండ్స్‌లో బహిరంగ సభ ప్రారంభమై సాయంత్రం 4.45 గంటల వరకూ జరగనుంది.

బస్సుయాత్ర విజయవంతం చేయాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన సామాజిక సాధికారతను ప్రజలకు వివరించేందుకు చేపడుతున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలి. సాధికారతకు సీఎం సరికొత్త అర్థం చెప్పారు. విశాఖలోనే అత్యధికంగా తూర్పు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు, రాజకీయ పదవులు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఈ యాత్రకు తరలిరావాలి. బైక్ ర్యాలీలతో బస్సు యాత్రకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు.

– ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త

తరలిరండి



తూర్పు నియోజకవర్గంలో తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు తరలిరావాలి. మేయర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పరిశీలకులతో పాటు పార్టీ ముఖ్య నాయకులు హాజరై దిగ్విజయం చేయాలి.

– కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆర్జిత సేవలు పునరుద్ధరణ



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలను శుక్రవారం నుంచి తిరిగి పునరుద్ధరించారు. తిరునక్షత్రం పూజలు సందర్భంగా ఈనెల 12నుంచి 16వతేదీ వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. తిరునక్షత్రం పూజలు ముగియడంతో తిరిగి యథావిధిగా ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని మండపంలో వేంజేంపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు.

శేష జీవితమంతా అద్వైత చింతనతోనే..

- హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక అధ్యయన కేంద్రం
- వచ్చే ఏడాది నుంచి అక్కడి నుంచే అద్వైత సేవలు
- విశాఖలో ఇదే నా చివరి జన్మదినోత్సవం
- శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ కీలక ప్రకటన



స్వామీజీ ఆశీస్సులు అందుకుంటున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



స్వామీజీతో వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, అదీప్‌రాజ్



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న స్వామీజీ

పెందుర్తి : జన్మదినోత్సవం వేళ విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో 30 ఏళ్ల పాటు ఆధ్యాత్మిక సేవలందించిన స్వామీజీ శేష జీవితాన్ని హైదరాబాద్‌లోని కోకాపేటలో నిర్మించనున్న ఆధ్యాత్మిక అధ్యయన కేంద్రంలో గడిపేందుకు సిద్ధమైనట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది నుంచి ఆ అధ్యయన కేంద్రంలోనే ఉంటూ ఆదిశంకరుల అద్వైత తత్వంపై పరిశోధనలు చేపడతామన్నారు. విశాఖలో ఇదే ఆఖరి జన్మదినోత్సవం అని..రానున్న జన్మదినోత్సవాలు అక్కడే జరుపుకుంటానని స్పష్టం చేశారు. విశాఖ శ్రీశారదాపీఠంలో శుక్రవారం జన్మదినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ గురువు (స్వామిజీ)కి పాదపూజ చేసి భిక్షావందనం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహభాషణం చేస్తూ తాను సన్యాసం స్వీకరించి 30 ఏళ్లు పూర్తయిందని..తెలుగునాట కీర్తి కాంక్ష లేకుండా శంకరాచార్య సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఆధ్యాత్మిక విప్లవాన్ని సృష్టించేలా శ్రీశారదాపీఠాన్ని తీర్చిదిద్దామన్నారు. ఆదిశంకరుల అద్వైత తత్వంపై విదేశాల్లో సైతం అధ్యయనం చేసేందుకు వీలుగా హైదరాబాద్ కోకాపేటలో రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. విశాఖ శ్రీశారదాపీఠం బాధ్యతలు వచ్చే ఏడాది జన్మదినోత్సవంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీకి అప్పగిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది షష్టిపూర్తి కార్యక్రమం అధ్యయన కేంద్రంలోనే చేసుకుంటానని పేర్కొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా పీఠం విశేష ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పీఠం ఆస్థాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు సహా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం స్వామీజీ చేతుల మీదుగా నిరుపేదలకు వస్త్రదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి స్వామీజీ ఆశీసులు తీసుకున్నారు. టీటీడీ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహచలం, కాణిపాకం, అరసవిల్లి, మహానంది, అహోబిలం, యాగంటి, గండి, కనకదుర్గ, కనకమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానాల నుంచి ఉన్నతాధికారులు, అర్చకులు స్వామీజీకి పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు వేణుగోపాలకృష్ణ, గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, భారత క్రికెట్ జట్టు ఆటగాడు కె.ఎస్ భరత్, ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్,మధుసూధన్‌రెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పూర్ణచంద్రప్రసాద్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్, శెట్టి పాల్గుణ, గణబాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కలికల్ వలవన్, కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, యానాం మాజీ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భగవాన్ జయరామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వామీజీ ఆశీసులు అందుకున్నారు.

హాట్‌కేకుల్లా అమ్ముడైన టీ-20 టికెట్లు

కౌంటర్ల వద్ద బారులు దీరిన అభిమానులు



టికెట్లు పొందిన ఆనందంలో..



టీ-20 టికెట్ల కోసం భారీ క్యూలో అభిమానులు

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈనెల 23న జరగనున్న భారత్–ఆస్ట్రేలియా టీ20 తొలి మ్యాచ్ టికెట్లు హాట్‌కేక్‌లా అమ్ముడయ్యాయి. ఇప్పటికే ఏసీఏ ఆధ్వర్యంలో పేటీఎం ద్వారా ఆన్‌లైన్ టికెట్ల విక్రయాన్ని ముగించగా శుక్రవారం ఐదు వేల టికెట్లను ఆరు డినామినేషన్లలో కౌంటర్ల ద్వారా విక్రయించారు. వైఎస్సార్ స్టేడియంతో పాటు టౌన్ కొత్తరోడ్, గాజువాకల్లోని మున్సిపల్ స్టేడియాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి టికెట్లను విక్రయించారు. కనీస ధర రూ.600 నుంచి గరిష్ట ధర రూ.6000లో పాటు రూ.1500, రూ.2000,రూ.3000,రూ.3500లు టికెట్లను మూడు ప్రాంతాల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి విక్రయించారు. శుక్రవారం ఉదయం నుంచే ఆయా సెంటర్ల వద్ద అభిమానులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టికెట్ల విక్రయాన్ని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ రవిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా పొందిన టికెట్లను స్టేడియంలో ప్రవేశానికి ఫిజికల్ టికెట్లుగా మార్చుకునేందుకు ఆయా సెంటర్లలోనే 22వ తేదీ వరకు అవకాశం కల్పించగా మ్యాచ్ జరిగే రోజు ఈనెల23న స్టేడియంలోనూ టికెట్లను మార్చుకునేందుకు అవకాశం కల్పించామని గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో శనివారం సైతం ఆరు డినామినేషన్లలో టికెట్లను ఆయా కౌంటర్ల ద్వారా విక్రయించనున్నామని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం

మహారాణిపేట: పరిశ్రమల ఏర్పాటుకు, నిర్వహణకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన డీఐఈపీసీ(డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ) సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మతో పాటు పాల్గొన్న కలెక్టర్ పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. సింగిల్ విండో విధానంలో భాగంగా సులభతర రీతిలో అనుమతులు జారీ చేస్తామని, సమస్యలేమైనా ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ముందుగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్.గణపతి అజెండా అంశాలను వివరించారు. సింగిల్ విండో విధానంలో ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద 130 దరఖాస్తులు అందాయని, వాటిలో 84 దరఖాస్తులకు అన్ని రకాల అర్హతలూ ఉన్నాయని చెప్పారు. మరో 38 పరిశీలన దశలో ఉన్నాయన్నారు. ఆటోనగర్ పారిశ్రామికవాడలో నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.త్రినాథ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్.గణపతి, ఏడీ రమామణి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కాశీ రైలు షెడ్యూల్ ఖరారు

తాటిచెట్లపాలెం : ఉత్తరాంధ్ర, దక్షిణ, పశ్చిమ ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల జిల్లాల వాసులకు ప్రయోజనం చేకూరేలా సంబల్‌పూర్–వారణాసి(బనారస్)–సంబల్‌పూర్ రైలును విశాఖపట్నం వరకు పొడిగించారు. ఈ మేరకు ఈ రైలు షెడ్యూల్, వివరాలను వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పొడిగింపు రైలును ఈ నెల 20న సాయంత్రం 4.30గంటలకు రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ సంబల్‌పూర్‌లో ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి ఈ రైలు ఈ నెల 22వ తేదీ నుంచి నడుస్తుంది.

- విశాఖపట్నం–బనారస్(18311) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధ, ఆదివారాల్లో విశాఖపట్నంలో(ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమై) ఉదయం 4.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.25 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–విశాఖపట్నం(18312) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి గురు, సోమవారాల్లో బనారస్‌లో(ఈనెల 23 నుంచి ప్రారంభమై) మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–సంబల్‌పూర్ మధ్య ఈ రైళ్లు ఇరువైపులా బార్‌గఢ్‌రోడ్, బాలంగిర్, టిట్లాఘడ్, కేసింగ, మునిగుడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస స్టేషన్లలో ఆగుతాయి. 1–సెకండ్ ఏసీ, 4–థర్డ్ ఏసీ, 8–స్లీపర్ క్లాస్, 6–జనరల్ సెకండ్ క్లాస్, 1 సెకండ్ క్లాస్‌కం దివ్యాంగ్ కోచ్, 1–జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో ఈ రైళ్లు నడుస్తాయని డీసీఎం తెలిపారు.

జెడ్పీ వైస్ చైర్మన్ మర్యాద పూర్వక కలయిక



వైవీ సుబ్బారెడ్డి, కోలా గురువులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు

పద్మనాభం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పద్మనాభం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు శుక్రవారం వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వారిని కలిసిన గిరిబాబు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నేడు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను శనివారం జరగనున్నాయి. పోటీలు అనకాపల్లి పార్క్ జంక్షన్, గౌరీ సేవా సంఘం ఆవరణలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి ఎం.వి. నాగేశ్వరరావు తెలిపారు. మూడు జిల్లాల నుంచి ఎంపికైన జట్లు ఉదయం 9 గంటలకు వేదిక వద్దకు హాజరుకావాలని, అర్హత పత్రాలకూడా తీసుకురావాలని ఆయన కోరారు.

నమో నాగేంద్రాయ..

- భక్తిప్రపత్తులతో నాగుల చవితి
- పుట్టల వద్ద భక్తుల పూజలు



ముడసర్లోవలో పూజలు చేస్తున్న భక్తులు



కంబాలకొండలో..



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భక్తుల సందడి

ఆరిలోవ: ఓం నమో నాగేంద్రాయ నమః అంటూ భక్తులు శుక్రవారం నాగుల చవితి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే కుటుంబ సమేతంగా సంప్రదాయ దుస్తుల్లో ప్రకృతి పుట్టల వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో నాగన్నను పూజించారు. ఆరిలోవ ప్రాంతంలో సహజ సిద్ధమైన పుట్టలు ఎక్కువగా ఉండటంతో స్థానికులతోపాటు నగరం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చవితి ఉదయం 11.30 గంటల వరకు మాత్రమే సమయం ఉండటంతో తెల్లవారు 6 గంటలు నుంచే నాగన్నకు పూజలు చేశారు. ముడసర్లోవ పార్కు, కంబాలకొండ ఎకో టూరిజం పార్కు, ఇందిరాగాంధీ జూ పార్కు, కైలాసగిరితోపాటు పైనాపిల్ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ముడసర్లోవ, తోటగరువు, విమ్స్ ఆవరణ, పాత డెయిరీఫారం, విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డు, జోడుగుళ్లపాలెం, సీతకొండ పరిసరాల్లోని పుట్టల్లో భక్తులు పాలు పోసి, నువ్వు ముద్దలు, గుడ్లు వేసి చల్లగా చూడాలని నాగేంద్రుడిని వేడుకున్నారు. పళ్లు, పూలు పెట్టి పూజించారు. ఆయాచోట్లకు వేలాది మంది భక్తులు రావడంతో రోడ్లు వాహనాలతో నిండిపోయాయి. అలాగే ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం, పోర్టు స్టేడియం భక్తులతో కిటకిటలాడాయి.

పుట్టిన రోజునాడే విషాదం

- ఏయూ అవుట్ గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీ కింద పడి ఇద్దరి స్నేహితుల దుర్మరణం



ఘటనా స్థలంలో మనోహర్, అభిషేక్ మృతదేహాలు

బీచ్ రోడ్డు: అలల చెంతన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలు ఎంతో సంతోషంగా జరుపుకొన్నారు. ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. కాంక్రీట్ మిక్సర్ లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. లారీ చక్రాల కింద పడి ఇద్దరు స్నేహితులు ప్రాణాలు విడిచారు. వివరాలిలా ఉన్నాయి. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. శుక్రవారం కైలాసపురానికి చెందిన మనోహర్(17) పుట్టిన రోజు కావడంతో అదే ప్రాంతానికి చెందిన అభిషేక్(17), మరో స్నేహితుడు బీచ్‌లో వేడుక జరుపుకొన్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో చినవాల్తేరు నుంచి కైలాసపురం వెళ్తుండగా ద్విచక్ర వాహనంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో మరో స్నేహితుడు ద్విచక్ర వాహనం సహాయంతో అభిషేక్, మనోహర్ బైక్‌ను వెనక నుంచి నెట్టుకుంటూవస్తున్నారు. అలా వస్తున్న సమయంలో ఏయూ అవుట్ గేట్ వద్ద అదే మార్గంలో వెళ్తున్న కాంక్రిట్ మిక్సర్ లారీ కింద అదుపుతప్పి అభిషేక్, మనోహర్ పడిపోయారు. దీంతో ఇద్దరూ ఘటన స్థలంలోని మృతి చెందారు. స్నేహితులిద్దరూ కైలాసపురంలోని ఓ ప్రైవేటు కాలేజ్‌లో ఇంటర్ ద్వితీయ సంత్సరం చదువుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి తల్లిదండ్రులకు సమాచారమందించారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీపీ

ప్రమాద స్థలాన్ని నగర సీపీ రవిశంకర్, ఏడీసీపీ శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగింది.. మృతి చెందిన వారి వివరాలను తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమూల మార్పులు

- నాడు–నేడుతో మెరుగైన వైద్య సేవలు
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- శ్వాసకోశ, అంటువ్యాధుల ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులు

మహారాణిపేట: నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ శ్వాసకోశ, అంటువ్యాధుల ఆస్పత్రి ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. రోగుల సహాయకులు వేచి ఉండేందుకు రూ.10 లక్షలతో నిర్మించిన వెయిటింగ్ లాంజ్, భోజన సదుపాయ గదులను ప్రారంభించారు. రూ.17.5 లక్షలతో అభివృద్ధి చేసిన 16 పడకల రెస్పిరేటరీ ఇంటెన్సీ కేర్ యూనిట్‌ను, రూ.4 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఏబీజీఏ పరీక్ష యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శ్వాస కోస ఆస్పత్రిలో సుమారు రూ.65 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

ఛాతీ, మానసిక ఆస్పత్రులకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు

రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వ ఆస్పత్రుల విభాగంలో విశాఖలో రెండు ఆస్పత్రులు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పటల్స్ అండ్ హెల్త్ కేర్(ఎన్ఏబీహెచ్) గుర్తింపు పొందాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ శ్వాసకోస, అంటువ్యాధుల ఆస్పత్రి, మానసిక రోగుల ఆస్పత్రికి ఈ గుర్తింపు లభించిందన్నారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది, వైద్యుల పనితీరు వల్ల ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ప్రభుత్వ శ్వాస కోశ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ బి.ఎ.నాయుడు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావంతోనే ఆత్మజ్ఞానం

ముగిసిన గరికిపాటి ప్రవచనాలు



మద్దిలపాలెం : ఆధ్యాత్మిక భావంతోనే ఆత్మ జ్ఞానం సాకారమవుతుందని, శివనామస్మరణతోనే పాపాల నుంచి విముక్తికి అవకాశం ఉంటుందని ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహారావు తెలిపారు. నాలుగు రోజులుగా విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆకాశ దీపం –కాశీ ఖండంపై నిర్వహిస్తున్న ప్రవచనాలు శుక్రవారం ముగిశాయి. దేవస్థానాల్లో రామకృష్ణ పరమ హంస వంటి వారికే పూర్ణ కుంభంతో స్వాగతం పలకాలని గరికిపాటి అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు బాధ్యతతో మెలగాలన్నారు. పిల్లలు తల్లిదండ్రుల రుణం తీర్చికోవాలని సూచించారు. అహం తగ్గించుకుని మనసులో జ్ఞాన దీపం వెలిగించుకోవాలన్నారు. విద్యారంగంలో ఒత్తిడి కారణంగానే యువత ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.ఆర్.గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకగా 'సుందర్ స్కైలాంజ్' బ్రోచర్ ఆవిష్కరణ



సుందర్ స్కైలాంజ్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, తదితరులు

మధురవాడ: ప్రముఖ గృహ నిర్మాణ సంస్థ వైశాఖీ నూతన వెంచర్ 'సుందర్ స్కైలాంజ్' బ్రోచర్‌ను మధురవాడ రెవెన్యూ కాలనీలో ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వీడియోను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ఆవిష్కరించారు. వైశాఖీ సంస్థ అధిపతులు బలుసు విద్యాసాగర్, బలుసు రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు 30 అంతస్తుల్లో గేటెడ్ కమ్యూనిటీగా చేపడుతున్నామన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఒక కొత్త డిజైన్, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాలకు మేలు చేసిన సీఎం

- ఇళ్ల మరమ్మతులకు అవకాశం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు
- త్వరలోనే పంచగ్రామాల భూసమస్య పరిష్కారం
- మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం : పంచగ్రామాల్లో నివాసితులు ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెమో జారీచేయడం చాలా సంతోషంగా ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకుని మేలు చేశారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఏళ్ల తరబడి ఇళ్ల మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్న నివాసితుల మోముల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఆనందం నింపారన్నారు. సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం రాజగోపురం వద్ద ప్రభుత్వం జారీ చేసిన మెమో కాపీని ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ పంచగ్రామాల ప్రజలు రెండు దశాబ్దాలకు పైగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచగ్రామాల సమస్యకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్ ఉండటంతో ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు కూడా దేవస్థానం అనుమతించలేదన్నారు. ఈ విషయాన్ని తనతోపాటు సహచర ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిజమైన బాధిత నివాసితుల ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు ఈ మెమో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మరోపక్క పంచగ్రామాల భూ సమస్యను కూడా పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు. అడవివరంలోని 1.5 కిలో మీటర్ల బీఆర్‌టీఎస్ రోడ్డు పనులకు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి త్వరలోనే రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో 98వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు వరదా నరసింహమూర్తి, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.